11న విశ్వకర్మల ఆత్మీయ కలయిక

కాచిగూడ, ఫిబ్రవరి 9: ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో ఈ నెల 11వ తేదీ ఆదివారం ఉదయం 10:30 విశ్వకర్మ ఆత్మీయ కలయిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు విశ్వకర్మ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అడ్లూరి రవీంద్రచారి శుక్రవారం తెలిపారు. ముఖ్య అతిథులుగా హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, మంత్రులు, ఎమ్మెల్యేలు విచ్చేస్తున్నట్లు తెలిపారు. విశ్వకర్మలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నుమాయిష్‌లో రేపు వెల్ బేబీ షో

అబిడ్స్,ఫిబ్రవరి 9 : ఈ నెల 11న నుమాయిష్‌లో యశోద హాస్పిటల్స్ సహకారంతో వెల్ బేబీ షోను నిర్వహిస్తున్నట్లు ఎగ్జిబిషన్ సొసైటీ కార్యదర్శి బి. హనుమంత్‌రావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఎగ్జిబిషన్ మైదానంలోని లాన్‌లో ఈ షోను నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ షోలో 1 నుంచి 3 సంవత్సరాల వయస్సు ఉన్న చిన్నారులు పోటీలు ప్రారంభమయ్యే ముందు వరకు రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ఉందని అన్నారు. ఈ షోలో పాల్గొన్న వారందరికీ బహుమతులు అందజేస్తామని తెలిపారు. అర్హులైన చిన్నారులు పాల్గొనేలా చేసి షోను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఇంటింటా ప్రజాపాలన దరఖాస్తుల పరిశీలన

- వివరాల సేకరణకు 80 మంది సిబ్బంది
- రెండు రోజుల్లో ప్రక్రియ పూర్తి
- డీసీ మారుతీ దివాకర్ వెల్లడి

ప్రజాపాలన దరఖాస్తులను వెరిఫికేషన్ చేస్తున్న ఏడీఈ సీనయ్య

అంబర్‌పేట, ఫిబ్రవరి 9 : ప్రజాపాలనలో ప్రజలు రూ.500లకే గ్యాస్ సిలిండర్ కోసం చేసుకున్న దరఖాస్తుల పరిశీలన శుక్రవారం మొదలైంది. అంబర్‌పేట సర్కిల్ పరిధిలో రూ.500లకే గ్యాస్ సిలిండర్ కోసం 11,451 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తులను పరిశీలించేందుకు ప్రత్యేకంగా 80 మంది సిబ్బందిని నియమించినట్లు డీసీ మారుతీ దివాకర్ తెలిపారు. ఎస్ఎఫ్ఐలు, ఎంటమాలజీ విభాగం సిబ్బంది, ఆర్‌పీలు దరఖాస్తులను పరిశీలిస్తున్నారని చెప్పారు. ఇంటికీ వెళ్లడం, ఫోన్‌లో వివరాలను సేకరించడం జరుగుతున్నదన్నారు. కొందరు గ్యాస్ ఏజెన్సీల పేర్లు తప్పు రాశారని, హెచ్‌పీ ఉంటే ఇండియన్ అని రాశారని, వాటిని సరిచేస్తున్నామని చెప్పారు. రెండు రోజుల్లో మొత్తం దరఖాసుల పరిశీలన పూర్తవుతుందని ఆయన వెల్లడించారు.

గృహజ్యోతి వివరాల సేకరణ

ఆరు గ్యారంటీల్లో భాగంగా ప్రజాపాలనలో ఇటీవల ప్రజల నుంచి అన్నింటికీ కలిపి ఒకే దరఖాస్తులు స్వీకరించగా, ప్రస్తుతం ట్రాన్స్‌కో అధికారులు గృహజ్యోతికి సంబంధించి 200 యూనిట్లలోపు కరెంటు బిల్లు వచ్చిన వారి నుంచి వివరాలు సేకరించడం ప్రారంభించారు. శుక్రవారం ట్రాన్స్‌కో అంబర్‌పేట సబ్ డివిజన్ పరిధిలోని అంబర్‌పేట, గోల్నాక, రామాలయం సెక్షన్ల పరిధిలో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజల నుంచి వివరాలు సేకరించారు. ఏడీఈ సీనయ్య నల్లకుంట డివిజన్ తిలక్‌నగర్‌లో గల కమ్యూనిటీ హాల్‌లో వివరాలను తీసుకున్నారు. కరెంటు బిల్లుతో పాటు తెలుపు రేషన్‌కార్డు, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్లను ఇవ్వాలని సూచించారు. అంబర్‌పేట కరెంటు ఆఫీసు, గోల్నాక కార్యాలయంలో వీటిని స్వీకరించారు. తిలక్ నగర్‌లో కేంద్రాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు గరిగంటి రమేశ్, మాజీ కార్పొరేటర్లు దిడ్డి రాంబాబు, పులిజగన్, శంభుల శ్రీకాంత్‌గౌడ్‌లు సందర్శించి వివరాలను తెలుసుకున్నారు.

కె. అశోక్‌రెడ్డికి సన్మానం..

హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ కె.అశోక్‌రెడ్డి, గవర్నమెంట్ గార్డెన్స్ డిప్యూటీ డైరెక్టర్(టెక్నికల్) బి విజయప్రసాద్ లను శుక్రవారం టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్‌హుస్సేనీ మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ ఉపాధ్యక్షుడు కురాడి శ్రీనివాస్, సభ్యులు శంకర్, కేంద్ర సంఘం నాయకులు పర్వతాలు తదితరులు పాల్గొన్నారు. – సుల్తాన్‌బజార్, ఫిబ్రవరి 9

మాజీ ప్రధాని పీవీకి భారతరత్నపై హర్షం

సుల్తాన్‌బజార్/ చిక్కడపల్లి, ఫిబ్రవరి 9 : మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు భారతరత్నం ప్రకటించడం పట్ల ఆయన కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. శుక్రవారం గాంధీనగర్‌లోని పీవీ సోదరుడు పీవీ మనోహరరావు నివాసంలో సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పీవీ సోదరుడు మనోహర రావు మాట్లాడుతూ.. పీవీ తీసుకొచ్చిన సంస్కరణల వల్ల నేడు దేశం అన్ని రంగాల్లో అత్యున్నతంగా నిలిచిందన్నారు. పీవీ కుటుంబ సభ్యులు పీవీ సరస్వతి, పీవీ కిరణ్, భార్గవి, లతా, ప్రసాదరావు పాల్గొన్నారు.

☛ తెలంగాణ నుంచి తొలి తెలుగు మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకి కేంద్ర ప్రభుత్వం భారతరత్న ఇవ్వడం హర్షణీయమని చేనేత చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చిక్కా దేవదాస్ అన్నారు.

దేవదాస్

☛ మాజీ ప్రధాని పీవీ నరసింహరావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించడం హర్షణీయమని జేఎన్ఏ ఎఫ్ఏయూ ఫైన్ ఆర్ట్స్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్, రెడ్డి జన సంఘం సలహా దారు ప్రొఫెసర్ కంచర్ల దశరథ్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జేఎన్‌టీయూ అనుబంధంగా కొనసాగిన ఫైన్ ఆర్ట్స్ కళాశాలను యూనివర్సిటీగా ఏర్పాటు చేయడం లో పీవీ నరసింహారావు చేసిన కృషి మరువలేనిదన్నారు.

పీవీ సోదరుడు మనోహరరావుకు మిఠాయి తినిపిస్తున్న కుటుంబ సభ్యులు

సినీ నటి జయసుధకు ఆహ్వానం

గ్లోబల్ కల్చరల్ ఫెస్టివల్ ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీన (నేడు) నుమాయిష్‌లో నిర్వహిస్తున్న వాయిస్ ఆఫ్ టాలీవుడ్ సునీత సంగీత కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని శుక్రవారం సినీ నటి జయసుధను ఆమె నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేస్తున్న గ్లోబల్ కల్చరల్ ఫెస్టివల్ సలహాదారులు డాక్టర్ బి. ప్రభాశంకర్, కన్వీనర్ ముఖైర్ హైదర్, సభ్యుడు భరద్వాజ్ తదితరులు. ఈ సందర్భంగా జయసుధను సన్మానిస్తున్నట్లు వారు తెలిపారు. – అబిడ్స్, ఫిబ్రవరి 9

డాక్టర్‌కు మనోజ్‌రెడ్డికి సన్మానం

పేద ప్రజలకు ఉత్తమ వైద్య సేవలందిస్తున్న యూపీహెచ్‌సీ ఆర్‌హెచ్ఎఫ్‌డబ్లూటీసీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మనోజ్‌రెడ్డిని ప్రభుత్వం ఇటీవల గుర్తించి ఉత్తమ మెడికల్ ఆఫీసర్‌గా ఎంపిక చేసింది. ఈ సందర్భంగా శుక్రవారం కాచిగూడ కార్పొరేటర్ ఉమా రమేశ్‌యాదవ్ ఆధ్వర్యంలో డాక్టర్ మనోజ్‌రెడ్డిని సన్మానించారు. కన్నె రమేశ్‌యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్లు పాల్గొన్నారు. – కాచిగూడ, ఫిబ్రవరి 9

జియాగూడలో డిప్యూటీ కమిషనర్ పర్యటన

జియాగూడ డివిజన్ జీహెచ్ఎంసీ కాలనీలో శుక్రవారం సర్కిల్ –13 డిప్యూటీ కమిషనర్ శశిరేఖ, అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా నోటిఫైడ్ స్లమ్ కార్యక్రమంలో భాగంగా మురికి వాడల్లో సమస్యలను గుర్తించడం జరిగిందని శశిరేఖ తెలిపారు. ఈఈ వెంకట శేషయ్య, డిప్యూటీ ఈఈ శంకర్, అధికారులు పాల్గొన్నారు. – మెహిదీపట్నం ఫిబ్రవరి 9

ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలి

ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలని చిక్కడపల్లి సీఐ సీతయ్య అన్నారు. శుక్రవారం చిక్కడపల్లి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రొదుటూరి నర్సింహారావు, కీర్తిశేషులు నరసిన వెంకటేశం కుటుంబ సభ్యుల సహకారంతో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు రమేశ్ గుప్తా, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు. – చిక్కడపల్లి, ఫిబ్రవరి9

తెలుగు తేజం పీవీకి భారతరత్న హర్షణీయం

మాజీ ప్రధాన మంత్రులు పీవీ నర్సింహారావు, చరణ్ సింగ్‌తో పాటు ప్రఖ్యాత వ్యవసాయ వేత్త ఎంఎస్ స్వామినాథన్‌కు దేశ అత్యున్నత పురస్కారం భారతరత్న ప్రకటించడం హర్షణీయమని తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం స్వర్గీయ మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు విగ్రహం వద్ద పూల వేసి నివాళులర్పించారు. – కవాడిగూడ, ఫిబ్రవరి 9

ఫ్యామిలీక్లబ్ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

కాచిగూడ, ఫిబ్రవరి 9: కొన్నేళ్లుగా ఉపాధి కోల్పోయిన తెలంగాణ ఫ్యామిలీ క్లబ్ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ ఫ్యామిలీ క్లబ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు ఎం. గోపాల్‌యాదవ్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం బర్కత్‌పురలో ఆయన మాట్లాడుతూ.. 25 ఏండ్లుగా వేలాది మంది కార్మికులు ఫ్యామిలీ క్లబ్‌లో పనిచేస్తున్నారని, అధికారుల ఏకపక్ష నిర్ణయాలతో కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయని, ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఫ్యామిలీక్లబ్ కుటుంబాలకు ప్రత్యామ్నాయం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు బాలరాజు, రమేశ్‌బాబు, అరుణ్‌ప్రసాద్, జమూర్‌నాయక్, పల్లె శంకర్, తిరుపతిరెడ్డి, చక్రవర్తి, రాజు గౌడ్, యాదగిరి, సంపత్ పాల్గొన్నారు.

లంగర్‌హౌస్ డివిజన్ అంబేద్కర్‌నగర్ గుండుపోచమ్మ ఆలయం వద్ద అమావాస్యను పురస్కరించుకుని శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ పూజల్లో ఆలయ చైర్మన్ వసంత్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్, శివకుమార్, సతీశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. – మెహిదీపట్నం ఫిబ్రవరి 9

ఆజామాబాద్ ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఆర్‌టీ కాలనీ కమిటీ ప్రతినిధులు

ముషీరాబాద్, ఫిబ్రవరి 9: ఆజామాబాద్(ముషీరాబాద్ డిపో వెనక)లో ఉన్న ఖాళీ ప్రభుత్వ స్థలాన్ని భూకబ్జాదారుల నుంచి కాపాడాలని స్థానిక ఎస్ఆర్‌టీ కాలనీ కమిటీ సభ్యుడు కోరారు. స్థానిక నాయకుల సహాయంతో కొంతమంది ప్రభుత్వ భూమిని ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. శుక్రవారం ఎస్ఆర్‌టీ క్వార్టర్స్ కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కాలనీ కమిటీ ప్రతినిధులు కె.విజయ్ రావు, మధు, శశికళ, లక్ష్మి, కళావతి తదితరులు మాట్లాడుతూ ఇంటి నం.1-7-1046, 15 వెనుక భాగంలో ఉన్న ఖాళీ స్థలాన్ని ఆక్రమించుకొని క్రయవిక్రయాలు చేయడానికి ప్రయత్నిస్తున్నారని, స్థలాన్ని కాపాడటంతో పాటు కుట్టు, కంప్యూటర్, అంగన్‌వాడీ సెంటర్‌లను ఏర్పాటు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సామ్యూల్, అనంత స్వామి, దేవకుమార్, జమ్మి, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు లోనయితే జీవితం అంధకారమే

- మోటివేషనల్ స్పీకర్ వేణు కల్యాణ్

బంజారాహిల్స్, ఫిబ్రవరి 9: ఫిలింనగర్‌లోని రౌండ్ టేబుల్ ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసాన్ని పెంచడంతో వారిలోని నైపుణ్యాలను బయటకు తీసే ఉద్దేశంతో ఫైవ్ ఫింగర్స్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ వేణు కల్యాణ్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేణు కల్యాణ్ మాట్లాడుతూ, ఇటీవల సెల్ ఫోన్ అనేది విద్యార్థులకు వ్యసనంగా మారిందని, సెల్‌ఫోన్ ఏకాగ్రతను దెబ్బతీయడంతో పాటు ఆరోగ్యానికి కూడా హాని కలిగిస్తోందన్నారు. విద్యార్థి దశలో చెడు అలవాట్లకు లోనయితే జీవితం మొత్తం అంధకారమవుతుందని, తల్లిదండ్రులు ఎన్నో ఆశలతో పిల్లలను చదివిస్తుంటారని, వారి ఆశలను తీర్చాల్సిన బాధ్యత విద్యార్థులదే అన్నారు.

బీఆర్ఎస్ ప్రజల పార్టీ

బీఆర్ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు సీఎంగా తెలంగాణ రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధి చేశారని మాజీ ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్‌రావు అన్నారు. గురువారం నాంపల్లి నియోజకవర్గం ఆసిఫ్‌నగర్ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు నవీన్, గోల్డ్‌మెన్ దుర్గం శ్రావణ్‌కుమార్ ఎంఎస్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ వచ్చే లోక్‌సభ ఎన్నికలలో బీఆర్ఎస్ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. – మెహిదీపట్నం ఫిబ్రవరి 9

అనుమతులు లేకుండా భవనం నిర్మాణం చేస్తున్నా జీహెచ్ఎంసీ సర్కిల్ –12 టౌన్‌ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.మెహిదీపట్నం శాంతి నగర్‌లో 170 గజాల స్థలంలో ఆరు అంతస్తులను నిర్మిస్తున్నారు. ఇంటి ముందు రోడ్డు కూడా సరిగా లేదని ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. – మెహిదీపట్నం, ఫిబ్రవరి 9

రేపు మార్కండేయ జయంతి

అంబర్‌పేట, ఫిబ్రవరి 9: సేవా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీన బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లో పోచమ్మబస్తీలో మార్కండేయ జయంతిని నిర్వహిస్తున్నట్లు సమితి అధ్యక్షుడు రచ్చ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా మార్కండేయ పల్లకీ సేవ ఉంటుందని, అనంతరం అన్నదాన కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పద్మశాలీ బంధువులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

డా.వరప్రసాద్‌కు కేవీ రమణాచారి పురస్కారం

రవీంద్రభారతి, ఫిబ్రవరి 9: వంశీ ఇంటర్నేషనల్ – ఇండియా ఆధ్వర్యంలో శుక్రవారం రవీంద్రభారతిలోని మెయిన్‌హాల్‌లో డా.కేవీ రమణాచారి 72వ పుట్టిన రోజును పురస్కరించుకొని సహస్రావధాని డా.కడిమిళ్ల వరప్రసాద్‌కు డాక్టర్ రమణాచారి జాతీయ జీవన సాఫల్య పురస్కార ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ కేవీ రమణాచారి, జగద్గురు శంకరాచార్య మహాసంస్థానము శ్రీ పుష్పగిరి పీఠాధీశ్వరులు శ్రీ అభినవోద్దండ విద్యాశంకర భారతీ స్వామి, సినీనటుడు తనికెళ్ల భరణి విచ్చేసి జ్యోతి వెలిగించి వరప్రసాద్‌కు పురస్కారాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు డా.కేవీ రమణాచారికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. వంశీ ఇంటర్నేషనల్ అధినేత డా.వంశీరామరాజు, కిమ్స్ ఆసుప్రతి పౌండర్ బొల్లినేని కృష్ణయ్య, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

డా.వరప్రసాద్‌కు డా.కె.వి.రమణ జాతీయ జీవన సాఫల్య పురస్కారం అందజేస్తున్న వక్తలు

రాంనగర్ వాసవి సేవా సమితి ప్రతినిధులు వాడకట్టు రాజు, రాజశేఖర్‌గుప్త, బుక్కరమేశ్, ఎర్రం శ్రీనివాస్, చల్లా శివకుమార్, గంజీ శ్రీనివాస్‌లు అమావాస్య సందర్భంగా శుక్రవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. – ముషీరాబాద్, ఫిబ్రవరి 9

జంపాల ప్రవీణ్‌కు సన్మానం

పద్మశ్రీ అవార్డు గ్రహీత దాసరి కొండప్ప జీవితాన్ని గురించి పరిశోధనాత్మక వ్యాసం రాసిన జంపాల ప్రవీణ్‌ను తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి నామోజు బాలాచారి అభినందించారు. తెలంగాణ సాహిత్య అకాడమీ ప్రచురిస్తున్న 'పునాస' త్రైమాసిక పత్రిక జనవరి నెలలో ప్రచురించిన జంపాల ప్రవీణ్ రాసిన దాసరి కొండప్ప గురించిన పరిశోధనాత్మక వ్యాసం ప్రచురించింది. అంతరించిపోతున్న బుర్రవీణ కళాకారుడు దాసరికొండప్ప ప్రతిభను గుర్తించిన ప్రవీణ్‌ను శుక్రవారం సాహిత్య అకాడమీ కార్యాలయంలో బాలాచారి సన్మానించారు. – రవీంద్రభారతి, ఫిబ్రవరి 9

ముందస్తు చికిత్సతో కుష్ఠువ్యాధి నయం

కాచిగూడ, ఫిబ్రవరి 9: కుష్ఠువ్యాధి నివారణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుందని డీఎంహెచ్‌ఓ డాక్టర్ పద్మజ అన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ నిర్మలా ప్రభావతి ఆధ్వర్యంలో శుక్రవారం కుష్ఠు వ్యాధిపై కామ్‌గార్‌నగర్ బస్తీ దవాఖానలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ డాక్టర్ పద్మజ మాట్లాడుతూ.. కుష్ఠు రోగం ప్రాణాంతకమైంది కాదని ఎండిటి(మల్టీ డ్రగ్ థెరపీ)చికిత్సతో కుష్ఠు వ్యాధిని నివారించినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బస్తీ దవాఖాన మెడికల్ అఫీసర్ డాక్టర్ నజీముున్నీసా, డాక్టర్ డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డితో పాటు నర్సులు, బస్తీవాసులు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిపై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ పద్మజ

సుప్రీం తీర్పు మేరకు పెన్షన్ వర్తింపజేయాలి

కాచిగూడ,ఫిబ్రవరి 9: సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం పెన్షన్‌దారులందరికీ పెన్షన్ వర్తింపజేయాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.కృష్ణమూర్తి అన్నారు. సుప్రీం తీర్పును అమలు చేయాలని కోరుతూ బర్కత్‌పుర ఈపీఎఫ్ కార్యాలయం ముందు శుక్రవారం తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ప్రతినిధులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి, ఎంఎన్.రెడ్డి మాట్లాడుతూ.. ఎగ్జెంప్టెడ్, అన్‌ఎగ్జెంప్టెడ్ అనే బేధం లేకుండా పెన్షన్ దారులందరికీ పెన్షన్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్రతినిధులు బర్కత్‌పుర ఈపీఎఫ్ కమిషనర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు.

ఈపీఎఫ్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

ఈ నెల 15న నారాయణ సేవా సంస్థాన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దివ్యాంగుల వైద్య శిబిరానికి హాజరుకావాలని బీజేపీ నాయకులు ప్రేమ్‌సింగ్ రాథోడ్‌ను శుక్రవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆయోధ్య నుంచి తీసుకువచ్చిన ప్రసాదాన్ని అందించి ఆహ్వానించిన నారాయణ సేవాసంస్థాన్ సలహాదారులు రిథేశ్ జాగిర్ధార్. – సుల్తాన్‌బజార్, ఫిబ్రవరి 9

రేషన్‌కార్డు ఉన్న వారికే 'గ్యారంటీ'లు వర్తింపు మోసం

బీజేవైఎం నగర మాజీ అధ్యక్షుడు వినయ్‌కుమార్

చిక్కడపల్లి, ఫిబ్రవరి 9: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీల అమలకు రేషన్ కార్డులు వున్న వారికి మాత్ర మే వర్తింప చేస్తామనడం ప్రజలను మోసం చేయడమేనని బీజేవైఎం మాజీ నగర అధ్యక్షుడు ఎ.వినయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం గాంధీనగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కాంగ్రెస్ అభయ హస్తం పేరుతో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన దరఖాస్తుల స్వీకరణలో నూతన రేషన్ కార్డులకు లక్షలాది మంది పేదలు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్‌కార్డులు మంజూరు చేయకుండా ఇప్పుడు రేషన్ కార్డు ఉన్నవారికే పథకాల అమలు అనడం ప్రజలను మోసం చేయడమేనని మండిపడ్డారు. అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులను ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

మాజీ కార్పొరేటర్ మునీందర్ మృతి

కార్వాన్, ఫిబ్రవరి 9 : భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుడు, జియాగుడా డివిజన్ మాజీ కార్పొరేటర్ అదిరాల మునీందర్ (59) అనారోగ్యం కారణంగా మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కొడుకులు ఉన్నారు. 2002లో జియాగుడా డివిజన్ బీజేపీ అభ్యర్థిగా బరిలోకి దిగి విజయం సాధించారు. ఆయన మృతి పట్ల బీజేపీ నాయకుతో పాటు పలువురు ఇతర పార్టీల నాయకులు సంతాపం ప్రకటించారు.

మునీందర్

సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శిగా వరుణ్ రాహుల్

ఆల్ఇండియా కాంగ్రెస్ సేవాదళ్ తెలంగాణ కార్యదర్శిగా చిక్కడపల్లికి చెందిన కెప్టెన్ ఆకెళ్ల వరుణ్‌రాహుల్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆలిండియా కాంగ్రెస్ సేవాదళ్ జాతీయ చీఫ్ ఆర్గనైజర్ లాల్ జి. దేశాయ్ పేరుతో జారీ చేసిన నియామక పత్రాన్ని తెలంగాణ రాష్ట్ర ఆక్టింగ్ ఆర్గనైజర్ ఎం.జితేందర్ శుక్రవారం వరుణ్ రాహుల్‌కు అందజేశారు. – చిక్కడపల్లి, ఫిబ్రవరి 9